జీవితం అంటే ఏమిటి అని ఆలోచించటంతోనే సరిపోయింది నారాయణ జీవితమంతా. మనిషి ఎందుకు పుడుతున్నాడు - ఎందుకు అంతమవుతున్నాడు - ఈ జనన మరణాలకు మధ్య ఈ పిడికెడు ప్రాణంమీద ఈ యావ ఎందుకు మొదలైన వేదాంత సంబంధ వ్యాపకం అతడి బుర్రలో మసలుతుంది.

ఇందుకు కారణం లేకపోలేదు. నారాయణకు వయస్సు లేకపోయినా జీవితాల్ని చాలా చవిచూశాడు. కాని ఈ అనుభవం జీవితంలో ఎందుకూ పనికి రాలేదు. అనుభవం అనుభవం లాగానే ఉండిపోయింది. ఒకమాటు నాతో ఏదో చెప్పబోయాడు. "నీ జీవితంలో సమస్యలు ఎవడికి కావాలోయి బోడి గొప్పలు చెప్పకు. బతకడంలోని ఒడుపులు ముందు నేర్చుకో— లేకపోతే వేదాంతంతో ఈ లోకంలో బ్రతకలేవు" అని ఖచ్చితంగా చెప్పాను.

"నువ్వు నన్నర్థం చేసుకోలేవురా" అని పెదవి విరిచాడు. నిజంగానే నే నతణ్ణి అర్థంచేసుకోలేను. నాకు ఈ "జీతాలు" మొదలైనవి తెలియవుకాని, జీవించటం తెలుసు. మంచి, చెడులను ఆలోచించటం తెలియదుగాని, మంచిగా బతకడం తెలుసు. అతడి వయస్సు సుమారు ముప్పైమూడు. నాకన్నా బహుశ ఓ ఏడాది చిన్నవాడై వుంటాడు. జుట్టంతా నెరసి ఆభై ఏండ్ల వాడిలా కనిపిస్తాడు. నేనతణ్ణి దాదాపు ఇరువది సంవత్సరాలుగా ఎరుగుదును. అదీ కాక ఇద్దరిదీ ఒకే ఆఫీసు. అతడు ఆఫీసులో చేరిన కొత్తలో - నాకింకా ఇప్పటికీ గుర్తు. అప్పుడే కాలేజీ వదిలి వచ్చినవాడిలా హుషారుగా ఉండేవాడు. మంచి ఇంగ్లీషు సినిమా వచ్చిందంటే మధ్యాహ్నం సెలవు చీటీ ఇవ్వకుండానే అట్నుంచి అటే మ్యాట్నీకి వెళ్ళిపోయేవాడు. మర్నాడు జీతం నష్టం చేయటమే కాకుండా, అతడిమీద చర్య తీసుకునేవారు. కాని అతడు బాధపడినట్లు కనిపించేవాడు కాదు. ఆ సినిమాలో రెండు గంటలసేపు పొందిన ఆనందానికి ఒక నెల జీతం నష్టమైనా ఫరవాలేదు అని తేలిగ్గా కొట్టి పారేసేవాడు. సాయంత్రం ఆఫీసు వదలిం తర్వాత రూమ్‌కెళ్ళి స్నానం చేసి గూడ కట్టుకట్టుకుని సిగరెట్ వెలిగించుకుని విలాసంగా అలా బయటకు వచ్చేవాడు. రాత్రి తొమ్మిదిగంటల దాకా రోడ్లంట తిరగటం అతని హాబీ—

"కాళ్ళు పీకవూ" అని ఓరోజు నే నడిగితే.


"కాళ్ళు పీకితేనే కానీ నిద్ర పట్టి చావదు" అని సమాధానం చెప్పేవాడు. కానీ నేడు గ్రహించినదేమిటంటే ఆ సమాధానం నిజం అయింది కాదని. ఆ తిరుగుళ్ళలో ఏదో గోప్యమైన కారణం వుంటుందని అంచనా ఒకరోజు ఎందుకో నాకు తెలియకుండానే అతడికి కనుపించకుండా అతణ్ణి అనుసరించాను. నిజానికి అతడు చేసిందేమీ లేదు అలా వెళ్ళి కాఫీ తాగి బజార్లో వచ్చేపోయే వాళ్ళని చూస్తూ నిలబడ్డాడు. అందమైన ఆడది కనుపిస్తే కనుమరుగయ్యేవరకూ అలా చూస్తూ ఉండిపోయాడు. మళ్ళీ మరో స్త్రీ. అలా గడిచిపోయింది రాత్రి తొమ్మిది గంటల వరకు — తర్వాత హోటల్లోకి భోజనానికి కాబోలు వెళ్ళాడు — తర్వాత రూమ్‌కి.

మర్రోజు ఆఫీసులో అడిగాను "ఏరా నారాయణా రోడ్డంతా అలా నోరు వెళ్ళబెట్టుకుని చూడకపోతే పెళ్ళిచేసుకుని ఇంటి పట్టున పడివుండరాదూ" అని.

"అదే అనుకుంటున్నాను. మీవాళ్ళల్లో ఎవరైనా వుంటే చూడు" అన్నాడు.

'సరిస్సరి—నీ తలమీద ఏదో వుందిఅంటే నీచేత్తోనే తీసెయ్ అన్నాట్ట వెనకటి కెవరో పెళ్ళిచేసుకోవటం నీఒంటికి మంచిది. ఓ

# మబ్బువిడిచిన ఎండ



గోవిందరాజు రాజ్యలక్ష్మీ శ్రీనివాస్

అమ్మాయిని చూసుకట్టుక" అన్నాను.

ఇది జరిగిన నెలరోజులకు అతడు ఓ రోజు ఆఫీసుకు మాంచి హుషారుగా వచ్చాడు. ఆఫీసు అని తెలిసికూడా ఈల వేయటం మొదలెట్టాడు. తర్వాత బంట్రోతుచేత ఇన్విటేషన్స్ పంచి పెట్టించాడు ఆఫీసంతా. అతడి పెళ్ళి!

"దంచేశావుపో—ఇహనీ "తిరుగుళ్ళ" ఉద్యోగం తప్పుతుంది అన్నాను ఇన్విటేషన్ చూస్తూ. సమాధానంగా సన్నగా నవ్వాడు. అతడి పెళ్ళికి ఆఫీసు యావత్తూ తరలి వెళ్ళింది. సిగ్గుపడుతూ పెళ్లిపీటల మీద కూర్చుని వున్నాడు నారాయణ. మంగళవాయిద్యాల రణగొణ ధ్వనిలో

ఒకళ్లు చెప్పేది ఒకళ్ళకి వినిపించదు. ఆమెను చూశాను. పెళ్ళికూతుళ్ళని కనిపెట్టటం కష్టం. ఆ ముస్తాబులో అందరూ ఒకే రకంగా ఉంటారు మరి. మంగళసూత్ర ధారణప్పుడు ఆమె తల ఎత్తింది. అప్పుడు సరిగా చూశా ఆమెను. అందమైన ముఖం కాటుకతో నిండివున్న విశాలమైన కనులు. హరిపిల్లలా కనుబొమ్మలు. నిజంగా నారాయణ అదృష్టవంతుడు. అతడికంటె అందగత్తె అని చెప్పవచ్చు. పీటలమీంచి లేచినప్పుడు చూశాను అతనికంటె ఓ గుప్పెడు పొడుగు కూడా వుందేమో అనిపించింది. చాలా డాబుసరి పర్సనాలిటీ అని చెప్పవచ్చు. నారాయణ ఇవతలికి రాంగానే "కంగ్రాచ్యులేషన్స్" అని మేం తెచ్చిందేమిటో అతడి చేతిలో పెట్టాము

"ఇవన్నీ ఎందుకోయ్ మీరు వచ్చారు అదే చాలు" అన్నాడు.

తర్వాత పది రోజులు అతడు సెలవు పెట్టాడు. "ఈ లోకం మరచిపోయేందుకు" అని నవ్వుకున్నాము.

నారాయణ ఆఫీసుకు తిరిగి వచ్చిం తర్వాత కొన్ని చవట జోక్స్ వేశారు. కొందరు. సిగ్గుపడటం తప్ప సమాధానం ఇవ్వలేదు.

ఒక రోజు నారాయణ నావు ఇంటికి వెళ్ళాను నవ్వుతూ ఆహ్వానించాడు-ముందు గదిలో ఇదరం కూచున్నాము. కిల కిల మటూ ఇద్దరు పిల్లలు ముందు గదిలోకి వచ్చి కుర్చీ కిందకు దొర్లిన బంతికోసం కీచులాడుకుంటున్నారు. నాకు ఆశ్చర్యం వేసింది.

"ఒరేయ్ అప్పుడే ఇద్దరా?" అన్నాను.

"ఛ ఊరుకో. మా తమ్ముళ్ళు" అన్నాడు.

"వీళ్ళంతా వున్నట్లు నా కెప్పుడూ చెప్పలేదే" అన్నాను.

"మొన్ననే అమ్మా నాన్నగారూ వచ్చారు - రమ్మనమని నేనే రాశాను" అన్నాడు.

"మరి ఇన్నాళ్ళూ తీసుకురాలేదేం" అన్నారు.

"అవసరం కనిపించలేదు."

"ఇప్పుడసలే అవసరం లేదుగా?" అన్నాను.

"ఏమో అప్పుడె అవసరమేమో"

"ఏం అనుమానంగా వుందా" అన్నాను.

గతుక్కుమన్నాడు నారాయణ-ఎందుకు అలా కంగారుపడ్డాడో అర్థం కాలేదు నాకు. "అబ్బే-ఛఛ-అదేంలేదే" అన్నాడు. నేనడిగింది "ఏమన్నా నెలతప్పటంవగైరా లేమోనని" కానీ నారాయణ దానికింత తడబడ్డాడెందుకో అర్థం కాలేదు.

ఆమె రెండు కప్పుల కాఫీతో ముందు గదిలోకి వచ్చింది. నాజూకైన చేతులతో కాఫీ టేబుల్ పైన పెడుతూంటే-

"నువ్వో కప్పు తెచ్చుకోకపోయావా" అన్నాడు. ఆమె సుతారంగా చేతులు తిప్పుతూ విలాసంగా నావంక చూసి వంట గదిలోకి వెళ్ళింది. ఆమె వెళ్ళిన ఒక నిముషంపాటు ఆమె గాజుల చప్పుడు నా చెవుల్లో గింగురుమన్నది. కాఫీ కప్పుతో తిరిగి ప్రత్యక్షం అయి నా ఎదురుగా కూచుంది ఆమె.

"మా ఆవిడ. సుశీలాదేవి బియ్యే." అని పరిచయం చేశాడు నారాయణ. నమస్కారం చేశాను. "వీడు. మూర్తి నా మిత్రుడు" ఆమె నాకు నమస్కారం చేసింది. అప్పుడే ఆమెను సరిగా చూశాను. ఆమె కనురెప్పలమధ్య ఏదో అయస్కాంతం వున్నది. అంచే మళ్ళీ మళ్ళీ చూడబుద్ధి పుట్టే ఆమె కనులనుంచి దృష్టి మరల్చుకోవటం మానవశక్యం కాదు. అందమైన శిల్పాలను చూసి ముందుకు అడుగువేయలేని సౌందర్యోపాసకుడు, అదే శిల్పాన్ని సజీవంగా చూసి మతి కోల్పోయినట్టుగా ఆమె కన్నుల వంకే చూస్తూ కూచున్నాను.

"అలా ఊరికే చూడకండి, కాఫీ చల్లారిపోతుంది" అన్నది సుశీలాదేవి.. సిగ్గు

పడిపోతూ, కాఫీ కప్పు అందుకున్నాను.

"చూశావా మూర్తీ నీ దొంగతనం బయటపెట్టింది మా ఆవిడ" అన్నాడు నారాయణ కాఫీ తాగి కప్పు టేబిల్ మీద పెడూ. ఏదో దొంగతనం చేసినవాడిలాగా భయపడ్డాను.

"కంగారు పడకు నీ తప్పేముందిలే. ఆమె కళ్ళలో ఆ లాఘవం వుంది. పంతులమ్మకు కళ్ళే ప్రధాన అంగాలు" అన్నాడు నారాయణ.

"అదేమిటి?" అన్నాను.

"అదేమరి – అందమైన పంతులమ్మ పాఠం చెబుతూంటే వినని, విని అర్థం చేసుకోని కుర్రకుంక ఎవడు? అసలు పంతులమ్మలూ, నర్సులూ అందంగా ఉండాలి. అందవిహీనమైన నర్సు పక్కన ఉంటే రోగం మరింత విజృంభించదూ?– అలాగే అంద విహీనమైన పంతులమ్మ పాఠం చెబుతుంటే – విద్య అన్నది అందవిహీనం అయిపోతుంది. అందుకే మా ఆవిడ అసలు సిసలైన పంతులమ్మ" అన్నాడు.


"మరి ఇంత వరకూ నాకు చెప్పలేదేం?" అన్నాను.

"మా ఆవిడ పంతులమ్మోయ్ – అని డప్పులు కొట్టుకుంటూ తిరగమన్నావా?" అన్నాడు.

కనుపక్కన నవ్వింది సుశీలదేవి. ఆమె పలువరుసలో కూడా ఏదో ఆకర్షణ ఉన్నది.

"ఆయన అనే మాటలు విన్నారా మూర్తి గారూ. పంతులమ్మ అంటే అంత చులకన అయిపోయింది ఆయనకు– అది వ్యంగ్యమే కానీ నిజమని దురభిప్రాయం పెట్టుకోకండి" అంది నాకేసి తిరిగి.

"ఛ, ఛ- అంతమాటా!"



"నిజానికి చెప్పొస్తే, నేను అందమైన దాన్నని మీరి నోటే కాకుండా, ఇతరత్రా కూడా విన్నాను. మరొకళ్ళు చెప్పేదాకా నా విషయం ఆలోచించుకోలేదు. కానీ, పదేపదే వింటే ఏమౌతుంది చెప్పండి— అహం చెలరేగుతుంది— ఇతరుల రూపాన్ని నాతో పోల్చుకోవాల్సి వస్తుంది— నేను అందమైన దాన్ని— నా భర్తకుతగినవాడేనా — అనే ఆలోచన వచ్చేదాకా— మనస్సు కోతి వంటిది అని పూర్వికే అన్నారా?" అన్నది నవ్వుతూ.

"కాను కానాను" అన్నాను. నిజానికి అంతకన్నా ఏం మాట్లాడాలో తోచలేదు. అంత నిరాఘాటంగా, కొత్త లేకుండా మాట్లాడుతున్న స్త్రీకి నాబోటి అర్భకుడు ఏమని సమాధానం చెప్పగలడు?—

"ఇప్పుడు మీ ఇద్దర్నీ తీసుకోండి.... మావారికన్నా మీరు అందంగా వుంటారని నా మనస్సు చెబుతున్నది" అన్నది.

గతుక్కుమన్నాను నేను.

కానీ నారాయణలో చలనం లేదు.

"చూశావా మూర్తీ-నిజం ఎంత నిక్కచ్చిగా చెప్పిందో" అన్నాడు—

"నాకు టైమయింది-వస్తా నారాయణా" అని హడావుడిగా లేచాను. ఇంక అక్కడ ఒక్క క్షణంకూడా వుండబుద్ధి పుట్టలేదు. మర్నాడు నారాయణ ఆఫీసులో అడిగాడు "అలా కంగారుగా పరిగెత్తుకొచ్చావేం?" అని. అందుకు నేను సమాధానం యివ్వలేదుగానీ "మళ్ళీ మీ ఇంటికి నన్ను పిలవకు" అన్నాను. ఇందుకు నారాయణ బాధపడ్డాడేమోకూడా నేను ఆలోచించదలుచుకోలేదు. నేను అనుకున్నది నిర్మొహమాటంగా చెప్పేశాను.

ఓ వారం రోజుల తర్వాత ఏం తోచక సినిమాకు వెళ్ళాను. హఠాత్తుగా నా వెనుక సీట్లో నారాయణ దంపతులు ప్రత్యక్షమయ్యారు.

నన్ను చూసి "నమస్కారం మూర్తి గారూ" అని సుశీలాదేవే ముందు పలకరించింది.

"ఏంరా సినిమాకు వెళ్తున్నానని నాతో చెప్తే జైల్లో పడేస్తానా?" అన్నాడు నారాయణ.

"అబ్బే అదేంలేదు" అన్నాను.

"సరే ఇటురా" అన్నాడు. లేచి వెనుక సీట్లోకి వెళ్ళి నారాయణ పక్కనే కూచున్నాను.

"ఇది సినిమా అంటారా, తోలుబొమ్మలాటంటారా?" అన్నది,

"మీరేదనుకుంటే అదే—మీకు సినిమాల విషయంలో ఇంత మంచి అభిరుచి వున్నదని అనుకోలేదు" అన్నాను.

"ఆవిడది మాంచి అభిరుచిలే" అని నారాయణ గొల్లున నవ్వాడు—ఆ నవ్వుకు అసలు అర్థంలేదు. అసంగతమైన నవ్వు అది. కాని ఆ నవ్వులో అతడు అనంతమైన తృప్తి పొందినట్టు కనుపించాడు. కొందరు ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాకుండా నవ్వుతారు. కొందరు బాధపడుతున్నా నవ్వుతూనే కపిపిస్తారు. కొందరు నిజంగా నవ్వుతున్నా తెచ్చిపెట్టుకున్నట్టు ఉంటుంది— కొందరు నిజంగా తెచ్చిపెట్టుకున్న నవ్వే నవ్వుతారు — కొందరి నవ్వు విషాదంలోంచి వచ్చిన కటూక్తి నవ్వులా ప్రకాశిస్తుంది. కొందరి నవ్వు ఆనందంలోంచి వెలువడ్డట్టు వుంటుంది. కొందరి నవ్వులో విషాదం చిందుతుంది, కొందరు నవ్వేందుకే ఈ భూమిమీద ఉద్భవిస్తారు. కొందరు నవ్వటం నేర్చుకుంటారు.

ఈ నవ్వుల గురించి ఎందుకు చెప్పుకొచ్చానంటే - వీటిలో నారాయణ ఏ తరగతికి చెందుతాడని నాలో నేనే కొన్నాళ్ళుగా వేసుకుంటున్న ప్రశ్న - చివరకు నేను నిర్ణయించుకున్నదేమిటంటే, నారాయణ ఆఖరి తరగతికి చెందుతాడని అంటే నవ్వడం నేర్చుకున్నవాడు.

* * *

మూడు రోజులు నేను ఆఫీసుకు పోలేదు. నాల్గోరోజు ఆఫీసుకి వెళ్ళగానే

నారాయణని పలకరించాను. "రెండు రోజుల సెలవు తర్వాత ఆఫీసుకి రావటం ఓ చిన్న సైజు నరకం కదూ?" అన్నాను నారాయణ ఏం మాట్లాడలేదు, పైగా ముభావంగాకూడా వున్నాడు. "ఏం అలా అన్నావు" అన్నాను.

"అబ్బే ఏం లేదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

"చెప్పవోయి బోడిగొప్పలుపోక" అన్నాను.

"కొందరికి ప్రతిమాలించుకొని గాని చెప్పుకోవటం ఓ జబ్బు. ఇటువంటి తరగతి వ్యక్తులకి తమ బాధలు, తమకు తెలిసిన ప్రతివ్యక్తి పంచుకొని సానుభూతి చూపిస్తేకానీ నిద్రపోరు. అటువంటి వాడా నారాయణ నాకు తెలిసినంతవరకూ అటువంటి వ్యక్తికాదు. ఏదో నిజంగానే బాధపడ్తూ వుండిఉండాలి.

"అలా అంటేకాదు చెప్పితీరాలి" అన్నాను.

"అలా విసిగించకు సాయంత్రం చూదాం" అన్నాడు.

సాయంత్రం ఆఫీసు కాంగానే ఇద్దరం బజారు కెళ్ళాం.

"సాయంత్రం చెప్తానన్నావు గుర్తుందా అన్నాను.

"ఇవి చెప్పుకొకూడని విషయాలు మూర్తీ. ఇవి నా స్వంత సమస్యలు, అయినా నీతో చెప్పుకుంటే కాస్త మనస్సు శాంతిస్తుందని చెప్తున్నాను. ఇవి కేవలం మనిద్దరిమధ్యా వుండిపోవాలసిన వేసుమా" అన్నాడు.

"ఏం నేను బాకా పుచ్చుకుని దేశమంతటా చాటుతానని భయమా?" అన్నాను.

"అబ్బే అదేం కాదు. కొందరి వివాహాలు చాలా వైభవంగా జరిగిపోతాయి_ వైభవంగానే జీవితంకూడా సాగిపోతుంది-వైభవంగానే షష్టిపూర్తి జరుగుతుంది-వైభవంగానే కాటికికూడా వెడతారు. కానీ కొన్ని వివాహాలు వున్నాయి చూశావూ-సమస్యలతో ప్రారంభంఅయి, సమస్యలతోనే కొట్టు మిట్టాడుతూ-సమస్యలుగానే మిగిలిపోతాయి. అన్ని వివాహాలూ శుభలగ్నానే జరుగుతాయికదామరి. అశుభం కొందరికే ఎందుకు జరుగుతోందో అర్ధంకాదు" అన్నాడు.

నారాయణ గొంతులో జీర గమనించాను. "ఏం? నీకేం కష్టం వచ్చింది ఇప్పుడు" అన్నాను.

"నా వివాహం ఒక శుభ ముహర్తాన్నే జరిగింది, జాతకాలు కూడా కలిసినై. ముహూర్తబలంమీద గట్టినమ్మకం ఉంది. అన్ని టైమ్ ప్రకారం సవ్యంగానే జరిగిపోయినై, మరి ఇన్ని అపసవ్యాలు ఎందుకు జరుగుతున్నాయో అర్ధం కావటంలేదు" అన్నాడు నిట్టూరుస్తూ,

"అసలు ఇంతకీ ఏం జరిగిందో చెప్పావు కాదు" అన్నాను.

"నా చిన్నతనంలో ఒక పెళ్ళికి వెళ్లాను. పెళ్ళికొడుకు నల్లగా వున్నాడు. పెళ్ళికూతురు ముద్ద బంతి పూవులా వుంది. పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా కాకి ముక్కుకి దొండపండు అని అనటం నేను విన్నాను. కానీ ఈ నాటి వరకూ వారి సంసారం


డా॥ పి.వి.కె.రావ్, B.A. సెక్స్ స్పెషలిస్ట్,



వైద్య విద్వాన్. వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత అంగము చిన్నదగుట. శీఘ్రస్ఖలనము. శుక్లనష్టము, సుఖరోగములకుమావి సికవ్యాధులకు శాస్త్రీయ చికిత్స విదేశీ యంత్రములతో ప్రత్యేక చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్. తెనాలి. ఫోన్ : 700.

SUVARNA

దివ్యంగా సాగిపోతోంది - కానీ నా విషయం వేరు, నేను తనకి నచ్చకపోతే ముందే చెప్పవచ్చుగా? నారాయణ కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

నేను చాలా బాధపడ్డాను పైలాపచ్చీసుగా తిరిగే నారాయణ ఎట్లా మాట్లాడుతున్నాడు.

"అసలు ఇప్పుడేం జరిగిందో చెప్పు. నా చేతనయినదేదో చేసేందుకు సిద్ధంగా వున్నాను" అన్నాను.

"నిముష నిముషానికీ నీకన్న నేను చాలా అందగత్తెను, నిన్ను కట్టుకుని నా అందాన్ని అడవికాచిన వెన్నెల చేసేస్తున్నాను" అని సూటిగా నాతో నే అంటూంటే, రోజుకొక బాకు చొప్పున నా గుండెల్లో దిగిపోతోంది. ఇవి నువ్వు తీర్చగల సమస్యలు కావు మూర్తీ. ఆమెలో మనోవికాసం కలిగిన నాడే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితులలో నాకలాంటి ఆశ లేదు. ఇక ఈ విషయాలను గురించి అడిగి నన్ను బాధించకు" అన్నాడు నారాయణ.

అతడి బాధ నేనర్థం చేసుకోగలను. నొక్కి అడిగినకొద్దీ అతని బాధ ఇనుమడింపచేసినవాడినవుతాను. ఇంక ఆ ప్రసక్తి అంతటితో ఆపేశాను. తర్వాత నాలుగు రోజులూ నారాయణ ఆఫీసుకు వస్తున్నా చాలా ముభావంగానే వుంటున్నాడు. నేనూ ఆ విషయాలు మినహా అతడితో మాట్లాడలేదు. ఆ తర్వాత అతడు వరుసగా వారం రోజులు ఆఫీసుకు రాలేదు. ఆఫీసుకి సెలవు చీటీ కూడా పంపించకపోవటంతో ఏ రోజుకారోజే అతడు వస్తాడన్న ఉద్దేశంతోనే వున్నాను నేను. కాని వారం రోజుల తర్వాత వుండబట్టలేక అతని ఇంటికేసి వెళ్ళాను. అతను ఇంట్లో లేడు. తల్లీ తండ్రీ, తమ్ముళ్ళూ ఎవరూ లేరు. సుశీలాదేవి ఒక్కర్తే ఉంది. "తర్వాత వస్తాలెండి" అని నేను తిరిగి రాబోతోంటే "వారు ఇప్పుడే వస్తారు కూచోండి. ఏం ఆయన లేకపోతే కూర్చోకూడదా?" అన్నది.

"అబ్బే అదేం కాదు" అంటూ నేను కూర్చున్నాను.

రెండు గ్లాసుల్లో కాఫీ తెచ్చింది. కాఫీ తాగుతూ "ఎక్కడికెళ్ళాడు" అన్నాను.

"ఎక్కడికి వెళ్ళేది చెప్పే అలవాటు లేదు. అయినా మీ యిద్దరికీ ఇంత స్నేహం ఎల్లా కుదిరిందో నా కర్థం కావటం లేదు" అన్నది.

"అదేం ప్రశ్న" అన్నాను నవ్వుతూ.

"అదే చిత్రం, నాకు భర్త అయివుండీ కూడా నాదగ్గరే మొహమాటపడే మనిషి ఆయన, పరాయి వారయినా మీరే నాతో చనువుగా వుండే మనస్తత్వం మీది. ఈ ఇద్దరికీ భేటీ ఎలా కుదిరిందో అర్థం కావటంలేదు నాకు" అన్నది.

"మీకు కోపంరాకుండా వుంటే ఒక్క మాట సూటిగా చెప్తాను. మీకన్నా నేను అందగత్తెను అని పదేపదే మీరనడంవల్ల అతను బాధపడుతున్నాడేమో మీరు గ్రహించగల్గారా? అన్నాను జంకుతూనే.

"ఏం వున్నమాటంటే తప్పా? నాకు ప్రపంచంఅంతా అందంగా వుండాలని అనిపిస్తుంది, కురూపినీ, కుష్ఠురోగినీ, బొద్దింకల్నీ, పందుల్నీ, చూస్తే నా కసహ్యం. ప్రపంచంఅంతా పాలపిట్టలతోనూ, నెమళ్ళ నాట్యాలతోనూ, సన్నజాజి పరిమళాలతోనూ. నిండివుండా లనిపిస్తుంది. కానీ కోతికి, కోతిపిల్లే పుడుతుంది కానీ అందమైన కుందేలు పిల్ల పుటదు కదా అని" కిసుక్కున నవ్వింది.

"అది దైవ సంకల్పం" అన్నాను వెర్రిముఖం వేసుకుని.

"ఆ దైవానికి పనిలేదు. ఒకచోట అందమైన శ్వేతజాతీయులు, ఒకచోట వికారం గొలిపే నల్లని నీగ్రోలూ, ఈ వైవిధ్యం ఎందుకో అర్థం కాదు. వికారం గొలిపే నీగ్రోలకన్నా అందమైన శ్వేతజాతీయులే నా కిష్టం. మా యింటి ముందు

పారే మురుగు కాలువను చూసి చూసి విసుగెత్తిన నాకు కుర్తాళంలోని జలపాతాలలో నగ్నంగా స్నానం చేయాలనిపిస్తుంది. మా యింటి ముందు మొండిగోడ ప్రక్కనున్న మోడువారిన మల్లె చెట్టుకి నీరు పోసి పోసి విసుగెత్తిన నాకు బృందావన ఉద్యానవనాల్లో స్వేచ్ఛగా గాలి పీల్చాలనిపిస్తుంది, నల్లులూ-బొద్దింకలూ-దోమలతో నిండిపోయిన ఈ మురికి కూపం వదలి ఏ కొండ చరియల్లోనో కాపురం ఉండాలనిపిస్తుంది. ఏదో వేదాంతం మాట్లాడుతున్నానుకదూ?" అని గొల్లున నవ్వింది సుశీలాదేవి. నా కెందుకో భయం పుట్టింది ఆ నవ్వు చూసి. ఆమె అలా ఎందుకు మాట్లాడుతుందో నాకర్థం కాలేదు.

"అవునవును అని ఓ వెర్రి స్టేట్‌మెంట్ ఇచ్చేసి నారాయణ కోసం వెయిట్ చెయ్యకుండానే చరచరా వచ్చేశాను.

నారాయణ వరుసపెట్టి పది హేను రోజులు ఆఫీసుకు రలేదు. నాకెందుకో కంగారు పుట్టింది. ఆమె మాటలు, అతడి తీరూ గురించి ఆలోచిస్తూంటే నాలో మరి కంగారు ఎక్కువై నిలవనీయక నారాయణ ఇంటికేసి దారితీశా. ఇల్లు తాళంవేసి వుంది. పక్కవాళ్ళని అడిగాను. ఊళ్లోనే వున్నాడని చెప్పారు. ఏమైనాసరే అతనిని కలుసుకోవాలని పట్టుదలతో ఆ అరుగుమీదే కూర్చుండిపోయాను. పిచ్చి పిచ్చి ఆలోచనలతోవున్న నాకు మెట్లెక్కుతున్న నారాయణ కనిపించాడు. అప్పుడు ఎనిమిది అయి వుంటుంది. నన్ను చూసీ చూడనట్లే వెళ్ళి తాళం తీసి ఇంట్లో ప్రవేశించాడు. నేనూ అతన్ని అనుసరించాను.

"ఏం ఆఫీసుకు రావటం లేదు" అన్నాను.

"రావటం లేదు అంతే" అన్నాడు.

అతడి గొంతు చాలా కఠోరంగా వినిపించింది నాకు.

"ఒంట్లో బాగోలేదా?" అన్నాను.

"నన్నాట్టే విసిగించకు" చాలా విసురుగా సమాధానం చెప్పాడు.

"మీ ఆవిడేదీ" అన్నాను వూరుకోక.

రివ్వున వెనక్కి తిరిగాడు. "చచ్చిపోయింది" ఇంకా పచ్చిగా చెప్పాలంటే "లేచి పోయింది" సరేనా" అన్నాడు.

నాకు గుండెల్లో బాకు దిగినట్లైంది. నేనింకేదో అనబోతూంటే "ప్లీజ్ గో అవుట్" "గెటవుట్ ప్లీజ్" అన్నాడు నారాయణ.

నేను మాట్లాడకుండా బయటకు వచ్చేశాను. ఇంటికి వస్తూంటే సుశీలాదేవి నా కళ్ళ ఎదుట నిల్చినట్లవుతోంది. తను అనుకున్నది సాధించగలనన్న మూఢమైన ఆత్మవిశ్వాసమే ఆమె నీ స్థితికి తెచ్చింది. పతనమయ్యానే అన్నబాధ ఆమెకు ఏకోశానా వుండకపోవచ్చు. ఆమె ఆ రోజు అన్నమాటలు నా చెవుల్లో మార్మోగుతున్నాయి.

"ఏ నవ మన్మథునితోనో కుర్తాళం జలపాతాలలో గానీ, మైసూరు బృందావన వుద్యానవనాలలోగాని, నయనతాల్ కొండ చరియల్లోగానీ ఆమె ఈ పాటికి స్వైర విహారం చేస్తూ వుండి వుండవచ్చు. కానీ-జలపాతాలలోని విద్యుత్ - వుద్యానవనాలలోని విషనాగులు - కొండచరియల్లోని భీకరమైన వన్యమృగాలూ - తనను కబళించివేస్తాయన్న వూహ ఆమెకు వచ్చి వుండకపోవచ్చు. అందంగా లేని సంపెంగ చెట్టు పరిసరాలను గుబాళింపచేస్తుందని ఆమె వూహించి వుండకపోవచ్చు. ✱

